

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 10 ఫిబ్రవరి 2023 | పేజీలు : 04


# పెద్దపప్పూరు ఇసుకరీచ్ వద్ద హైడ్రామా

**- ఇసుక తవ్వకాలకు అనుమతి లేదంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆందోళన - ఆందోళనకు అనుమతి లేదంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు**



ఇసుకరీచ్ వద్దకు వెలుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



ఇసుకరీచ్ వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న దృశ్యం

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు ఇసుక రీచ్ వద్ద గురువారం తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, పోలీసుల నడుమ హైడ్రామా నడిచింది. పెద్దపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదంటూ గురువారం జె.సి ప్రభాకర్‌రెడ్డి తన అనుచరగణంతో నేరుగా ఇసుకరీచ్‌కు చేరుకుని ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఇరువురు సిఐలు, ముగ్గురు ఎస్‌ఐలు, స్పెషల్‌పార్టీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు....అక్రమంగా ఇసుకరీచ్ నిర్వహిస్తుంటే పోలీసులు, గనులశాఖ అధికారులు ఏమి చేస్తున్నారంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డి పోలీసులతో వాదనకు దిగారు. ఇసుక రీచ్ అనుమతులు వుంటే చూపాలని లేని పక్షంలో జెసిబిలను, టిప్పర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని జె.సి ప్రభాకర్‌రెడ్డి పట్టుబట్టారు. ఈ విషయంపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి రిసీవ్డ్ కాపీ ఇవ్వాలని పోలీసులను జె.సి ప్రభాకర్‌రెడ్డి కోరారు. రిసీవ్డ్ కాపీ ఇస్తామంటూనే ఆయనను పోలీసులు జీపులో ఎక్కించుకుని శింగనమల వైపు వెళ్లారు. దీంతో పోలీసు జీపును జె.సి అనుచరులు ఇతర వాహనాల్లో అనుసరించారు. మార్గమధ్యంలో పోలీసులు వారిని అడ్డుకుని పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. దాదాపు మూడు, నాలుగు గంటల తరువాత జె.సి ప్రభాకర్‌రెడ్డిని పోలీసులు పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి ఆయనపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ సమయంలో పెద్దఎత్తున జె.సి అనుచరులు పోలీసుస్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌లో మనుషులను చంపిన చరిత్ర వుందని మా నాయకున్ని ఏమి చేస్తున్నారంటూ పోలీసులపై జె.సి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ఇసుక రీచ్ యదావిధిగా కొనసాగుతుండడం కొసమెరుపు.

## అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు

# అనుమతులివ్వడంపై పోరాడుతాం



**- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి - ఇరిగేషన్ రంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబు**

**- ఏపిని నాశనం చేసిన కర్ణాటక కాటన్ దొర చంద్రబాబు**

**- ఆయన హయాంలోనే కర్ణాటక రాష్ట్రం అనేక ప్రాజెక్టులు నిర్మించుకుంది**

**అనంతపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త బ్యూరో**

అప్పర్‌భద్ర ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడుతుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికున్నంత కాలం అప్పర్ భద్ర ప్రాజెక్టుకు ఎలాంటి కేటాయింపులు, అనుమతులు రాలేదన్నారు. 2010లో కృష్ణావాటర్ 9 టీఎంసీలను కేటాయించారు. 2011లో దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లి స్టే తెచ్చింది. ఈ రోజుకు కూడా అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు కేటాయింపులు లేవు. అలాగే పట్టిసీమ డైవర్షన్ ద్వారా గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లించారనే సాకుతో తమ రాష్ట్రానికి అదనంగా 25 టీఎంసీల నీటిని కేటాయించాలనే వాదనను తీసుకొచ్చిన కర్ణాటక రాష్ట్రం ఆ నీటిని కూడా అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు వినియోగించుకోవడానికి డిపిఆర్ పొందుపరిచింది. 2017లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే కర్ణాటక ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు కోసం ఫేజ్-2 ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతులు తెచ్చుకుంది. అలాగే స్టేజ్-2 ఎక్స్‌ఫాన్సన్‌కు కూడా అనుమతులు తీసుకున్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదు. అభ్యంతరాలు చెప్పలేదు. దీనిపై మన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫిడవిట్ ఫైల్ చేయడం జరిగింది. 2019లో వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు మార్లు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి లేఖలు రాశారు. అయినా కూడా 2020లో కేంద్ర ప్రభుత్వం దాదాపు 29 టీఎంసీలపైగా అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు నీటిని కేటాయించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫిడవిట్ ఫైల్ చేసింది. కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయంపై కచ్చితంగా న్యాయ పోరాటం చేస్తామన్నారు. రైతులు, వ్యవసాయం, సాగునీటి రంగంపట్ల చంద్రబాబు హయాంలో జరిగిన నిర్లక్ష్యపు ఆనవాళ్లు ఈ రోజుకు కూడా చేదు గుళికలు అందించే పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 1995-2004లో దేశ రాజకీయాలను శాషించానని చెప్పుకునే కాలం.కర్ణాటకకు చెందిన దేవేగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్రం ఏఐబిపి అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చి వేల కోట్ల రూపాయల నిధులను కర్ణాటకకు ఖర్చు చేశారు. ఇదే సమయంలో ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచారు. నారాయణ పూర్ డ్యాం నిర్మించారు. కర్ణాటకలో వారు పెట్టుకున్న లక్ష్యంలో కేవలం 2.5 లక్షల ఎకరాల మినహా మొత్తం సాగు యోగ్యం కాని భూములను సాగులోకి తెచ్చుకున్నారు. అది కర్ణాటకకు సువర్ణయుగం, చంద్రబాబు ఎంత గొప్ప మహానుభావుడు అంటే మనసులో మాట పేరు ఈఠ తన ఆత్మకథ రాసుకున్న పుస్తకంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయడం దండగ. ఆ డబ్బులు తిరిగి రావు. కాబట్టి ఆ మేరకు నిధులు ఇతర రంగాలకు మళ్లించడం సబబు అని సెలవు ఇచ్చాడు. వ్యవసాయం దండగ అని చంద్రబాబు మాట్లాడిన విషయం రాష్ట్రానికి తెలుసు. చంద్రబాబు హయాంలో ఇరిగేషన్ కోసం కర్ణాటక ప్రభుత్వం 100 రూపాయలు ఖర్చు చేస్తే ఏపిలో చంద్రబాబు 50 నుంచి 60 రూపాయలు ఖర్చు చేశారన్నారు. ఇరిగేషన్ రంగాన్ని నిర్వీర్యం చేశాడు. కర్ణాటక ప్రభుత్వం బాగా దూకుడుగా ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొచ్చిన కాలంలో చంద్రబాబు మన రాష్ట్రంలో నిర్వీర్యం చేశాడు. 2004లో చంద్రబాబు దిగిపోయే నాటికి 2003-04లో 1600 కోట్లు ఖర్చు చేస్తే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వచ్చిన తర్వాత 2004-05లో 3,300 కోట్లు, ఆ తర్వాత 6వేల కోట్లు, 9వేల కోట్లు, 12వేలకోట్లు, 16వేల కోట్లు కేటాయించి సాగునీటి రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారన్నారు. కోటి ఎకరాల సాగునీటి లక్ష్యంగా లక్ష కోట్లతో జలయజ్ఞం పథకాన్ని తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నిస్సాయుత వల్లే కర్ణాటక రాష్ట్రం అనేక ప్రాజెక్టులను పూర్తి చేసుకుంది. ఈ పాపానికి చంద్రబాబును జైల్లో పెట్టడమా, ఉరి తీయడమా ఏది కరెక్టో ప్రజలే చెప్పాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు.

# నెట్టికంటుని సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



శ్రీవారి సేవలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

**గుంతకల్లు, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయసా ్వమివారి దేవస్థానంను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డి దంపతులుతో పాటు కుటుంబసభ్యులు సమేతంగా సందర్శించారు. గురువారం దేవస్థానంకు వారి రాకతో ఇఒ డి.వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ సాంప్రదాయ పద్దతిన స్వాగతించారు. ఈ సందర ్భంగా వారు ఆలయం ప్రదక్షిణలతో శ్రీవారి మూలవరుల దర్శనం కల్పించి వారి కుటుంబ గోత్రనామముల పేరిట ప్రత్యేక అర్చనలతో విశేషంగా ఆకుపూజలను నిర్వహించారు. తదుపరి వారికి ఆలయ సాంప్రదాయ పద్దతిన శ్రీవారి ఆశీర్వచనాలతో శేషవస్త్రముతో సత్కరించి శ్రీవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదములను వితరణగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు, వేదపండితులు, అర్చక బృందంతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నది

**-సత్యసాయి సెంట్రల్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్**



ముఖ్యమంత్రితో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు, మంత్రి బొత్స, కలెక్టర్ బసంత్‌కుమార్

**శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త ప్రతినిధి:**

విద్యార్థుల కొరకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేద విద్యార్థులను ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూతనిస్తున్నదని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ తెలిపారు. ఈ యేడాది జనవరి 11వ తేదిన మిడ్డేమీల్స్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు హాజరై ప్రతిపాదన సమర్పించారని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 44,392 పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 38 లక్షల మంది విద్యార్థులకు పోషకాహార పానీయం(రాగిజావ) అందించేందుకు రాగిపిండి, బెల్లంను అందించేందుకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సుముఖత వ్యక్తం చేసిందని రత్నాకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా గురువారం ఆర్.జె.రత్నాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడులలో చదువుకునే నిరుపేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలను అన్ని మౌళిక సదుపాయాలతో కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా ఏర్పాటు చేస్తున్నారన్నారు. భగవాన్ సత్యసాయి బాబా స్పూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థన మేరకు జగనన్న గోరుముద్ద, ఎండిఎం కార్యక్రమాల్లో నమోదు నిలుపుదల మరియు హాజరు పెంచడానికి ఏకకాలంలో పోషకాహార స్థాయిలను మెరుగు పరిచేందుకు ఒక ప్రధాన కార్యక్రమం అన్నారు. అమ్మచేతి గోరుముద్ద గుర్తుకు వచ్చేలా ఈ పథకానికి మంచి పేరును ముఖ్యమంత్రి అందించారని, విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి హర్షనీయమన్నారు. అన్ని కార్యక్రమాల్లో కెల్లా నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, ఈ దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండేందుకు విద్యార్థుల విద్యార్థుల చదువులు ఎంతో ముఖ్యమని అందుకు ప్రభుత్వ బడులను కోర్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతుండడంతో హర్షనీయమన్నారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి జిల్లాకు భగవాన్ బాబా వారి పేరున నామకరణం చేయడం పట్ల ఈ రాష్ట్రం, దేశం, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భగవాన్ సత్యసాయి బాబా భక్తుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ నిర్ణయం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తమౌతోందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాక ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, పాఠశాలల విద్యాశాఖ కమీసనర్ ఎస్.సురేస్‌కుమార్, ఎపిఈడబ్ల్యూఐడిసి ఎం.డి.సి.ఎన్.దివాన్ రెడ్డి, మిడ్‌డేమీల్స్ డైరెక్టర్ నిధి మీనా, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ పి.బసంత్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ తప్పుతున్న విద్యార్థులు...!

**- క్యాటరింగ్ పనులకు వెళ్ళి మద్యం సేవించి హాస్టల్‌కి - జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ఫిర్యాదు చేసిన వార్డెన్**

**- విద్యార్థుల ప్రవర్తనలపై విచారణకు ఆదేశించిన కలెక్టర్ - అలాంటి విద్యార్థులకు తొలగించాలని కలెక్టర్ ఆదేశించినా చర్యలు శూన్యం**

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

**పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువస్తుంది. ఉచిత విద్య, వసతి సౌకర్యం కూడా కల్పిస్తుంది. కానీ కొందరు విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు. పాఠశాల-కళాశాలకు సక్రమంగా వెళ్లకుండా, హాస్టల్స్‌కు ఎప్పుడుపడితే అప్పుడు వస్తున్నారు...వెళ్తున్నారు. క్యాటరింగ్ పనులకు వెళ్లి ఆ డబ్బుతో మద్యం కొనుగోలు చేసి వసతి గృహంలోనే మద్యం సేవిస్తుండటం గమనార్హం.**



గుంతకల్లు బీసీ బాలుర కళాశాల హాస్టల్ (ఫైల్)

అనంతపురం జిల్లాలోని తాడిపత్రి ఏబీసీడబ్ల్యూవో పరిధిలోని ఓ బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో దాదాపు 50 మంది విద్యార్థులున్నారు. ఇందులోని కొందరు విద్యార్థులు కళాశాలకు సక్రమంగా వెళ్ళకుండా హాస్టల్ వార్డెన్, సిబ్బందికి తెలియకుండా క్యాటరింగ్ పనులకు వెళ్ళి అక్కడ వచ్చిన డబ్బుతో మద్యం (బీరు,మందు) కొనుగోలు చేసి దానిని సేవించి హాస్టల్‌కు ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నారు. వీరిని చూసి ఇతర విద్యార్థులు కూడా చెడిపోతారనే ఉద్దేశ్యంతో మహిళా వార్డెన్ ఈ విషయాన్ని ఆ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళింది. తమపై తమ తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసిందనే ఉద్దేశ్యంతో ఆ కొందరు విద్యార్థులు మహిళా వార్డెన్‌ను నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇబ్బందులు తాళలేక ఆ మహిళా వార్డెన్ జిల్లా కలెక్టర్‌ని కలిసి ఫిర్యాదు చేసింది.ఆ విద్యార్థులు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారోనని అందుకు సంబంధించిన వీడియోలను కూడా కలెక్టర్‌కి చూపించింది. ఇందుకు కలెక్టర్ వెంటనే స్పందించి దీనిపై వెంటనే విచారణ చేసి నివేదిక అందజేయాలని గుంతకల్లు ఆర్డీవోని ఆదేశించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో, బీసీ వేల్ఫేర్ అధికారులు హాస్టల్‌ను తనిఖీ చేసి విచారణ చేశారు. కొందరు విద్యార్థులు క్రమ శిక్షణ తప్పి మద్యం సేవిస్తున్నారని విచారణలో కూడా తేలింది. ఆ విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగిస్తే ఇక ఎలాంటి సమస్య ఉండదని విచారణ అధికారి తన విచారణ నివేదికలో పొందు పరిచినట్లు సమాచారం. విచారణ నివేదికను కలెక్టర్ పరిశీలించి ఆ కొందరు విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే బీసీ వేల్ఫేర్ అధికారులు ఇంత వరకు ఏ ఒక్క విద్యార్థిని కూడా తొలగించలేదు.దీంతో మహిళా వార్డెన్ మానసికంగా నానా ఇబ్బందులకు గురవుతుంది. అంతే కాకుండా ఇదే డివిజన్‌లోనే మరో బీసీ బాలుర హాస్టల్‌లో కూడా ఇటీవల ఐదు మంది పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణ తప్పి హాస్టల్లో ట్యూషన్ జరగకుండా నీళ్ల పోయడం లాంటి పనులు చేస్తుంటే ఈ విషయాన్ని ఇతర విద్యార్థులు వార్డెన్‌ను చెప్పడం జరిగింది. అప్పుడు వార్డెన్ ఆ ఐదు మంది విద్యార్థులను మందలించారు. మాపైనే వార్డెన్‌కు చెబుతారా? అని ఆ ఐదు మంది విద్యార్థులు ఇతర విద్యార్థులు చితకబాది ఈ విషయాన్ని ఎవ్వరికి చెప్పకూడదని బెదిరించడం జరిగింది. అయితే ఈ విషయం దెబ్బలు తిన్న విద్యార్థుల తల్లిదండ్రులే ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అప్పటి వరకు ఈ విషయం ఎవ్వరికి తెలియదు. అప్పుడు ఆ ఘటనపై ఏబీసీడబ్ల్యూవో విచారణ చేయగా...ఆ ఐదు మంది విద్యార్థుల ప్రవర్తన బాగలేదని, పాఠశాల హెచ్ఎం కూడా అదే విషయం చెప్పడంతో అప్పుడు ఆ ఐదు మంది విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించారు. వార్డెన్లు మంచిగా చెప్పినప్పటికీ విద్యార్థులు వినకుండా వార్డెన్లపైనే కావాలనే లేనిపోని ఆరోపణలు చేయడం వలన ఈ వార్డెన్ ఉద్యోగం మాకొద్దు బాబోయ్ అనే పరిస్థితిలో వార్డెన్లు ఉన్నారన్నది ఈ రెండు హాస్టల్స్‌లోని పరిస్థితులే ఉదాహరణ. కావున ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి క్రమశిక్షణ తప్పి ఇతర విద్యార్థులను కూడా క్రమశిక్షణలో లేకుండా చేస్తున్న విద్యార్థులను హాస్టల్ నుంచి తొలగించాలని ఇతర విద్యార్థులు కోరుతున్నారు. అయితే దీనిపై అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది వేచి చూడాల్సిందే.

### ప్రవర్తన బాగలేని విద్యార్థులను తొలగిస్తాం :బీసీ వేల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి



విద్యార్థులను తీసుకోవడం, ఒక వేళ వారి ప్రవర్తన బాగలేకపోతే తొలగించే అధికారం వార్డెన్లకు వుంది. ఓ హాస్టల్లోని కొందరు విద్యార్థుల ప్రవర్తన బాగలేదని కలెక్టర్ ఆదేశాలతో ఇటీవల ఆర్డీవో, తాము కలిసి విచారణ చేశాము. విచారణ నివేదికను కలెక్టర్‌కి పంపించాము. తదుపరి ఆదేశాల ప్రకారంగా చర్యలు తీసుకుంటాము.

# వైసీపీ దోపిడీకి పోలీసు రక్షణా

**- పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో మండి పడ్డ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు**

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ

రాష్ట్రంలో అధికార వైసీపీ నాయకుల దోపిడికి, యధేచ్చగా వారు సాగిస్తున్న అక్రమాలకు పోలసీఉలు వత్తాసు పలకడం చట్ట విరుద్ధమని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో వైసీపీ నాయకులు సాగిస్తున్న అక్రమ ఇసుక దోపిడిని ప్రశ్నించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రోజుకు 70 నుంచి 80 టిప్పర్లతో యదేచ్చగా వైసీపీ నాయకులు ఇసుకను దోచేస్తున్న స్థలాన్ని క్షేత్రస్థాయిలో జెసి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించడం నేరమా అని ప్రశ్నించారు. వైసీపీ వారు సాగిస్తున్న అక్రమాల గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని ఉదయం నుంచి గార్లదిన్నె, పామిడి, వజ్రకరూరు, ఉరవకొండ పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రతిపక్ష పార్టీ నాయకులను వేదించడానికే పోలీసు వ్యవస్థ ఉందా..? అంటూ నిలదీశారు. ఇంకెన్నాళ్లు వైసీపీ నాయకుల దోపిడీలను సమర్థిస్తారు. వాళ్ల సాగిస్తున్న అక్రమాలకు కొమ్ముకాస్తారన్నారు. అనంతపురం జిల్లాలో వైసీపీ నాయకులు చేస్తున్న అక్రమ ఇసుక దందాపై సమగ్రమైన విచారణ జరిపించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే జెసి ప్రభాకర్‌రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తప్పుడు కేసులు పెడితే తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# ఆ ఏపిడి కార్యాలయంలో అగమ్యగోచరంగా విధుల నిర్వహణ



కదిరి డ్వామా ఏపిడి కార్యాలయం

**- ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి**

**- 10 మండలాలను ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెర్జ్ చేసినా సమాచారం లేని వైనం**

**- డ్వామా పీడి సమావేశం నిర్వహించినా ఆసాంతం అంతా రహస్యమే ?**

**- మర్మదేశాన్ని తలపిస్తున్న ఏపిడి కార్యాలయ నిర్వహణ**

**కదిరి టౌన్, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

కదిరి ఏపిడి కార్యాలయంలో విధుల నిర్వహణ అగమ్యగోచరంగా తయారైందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఆ ఏపిడి కారా ్యలయ పరిధిలో ఎవరు ఎక్కడ ఉంటారో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆ ఏపిడి కార్యాలయ పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం సంబంధించిన ఉద్యోగులు, అధికారులు ఎవరు ఎక్కడ ఉంటారో ఎప్పుడు సమావేశాలు నిర్వహిస్తారో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గుమ్మనంగా సమావేశాలు, సమీక్షలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నెలలో ఓడీచెరువు క్లస్టర్‌కు సంబంధించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో బాగంగా నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు, నల్లచెరువు, తనకల్లు మండలాలను కదిరి ఏపిడి క్లస్టర్‌లోకి ఉమ్మడిగా కలిపివేశారు. అయితే ఇంత వరకూ ఈ మండలాలను మెర్జ్ చేసిన విషయాన్ని ఏ అధికారి తెలపలేదంటే వారి నిర్లక్ష్యదోరణి ఏమేరకు శృతిమించిందో అర్థం చేసుకోవాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా సత్యసాయి జిల్లాకు సంబంధించిన డ్వామా పీడి నెలలో రెండుసార్లు సమీక్షా సమావేశాలు పెట్టుకున్నా రాష్ట్ర స్థాయి నుంచి ఎవరైనా ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటుప్రజాప్రతినిధులకు గాను అటు పత్రికా విలేకరులకు కాని ముందుస్తు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి కూలీలకోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. గత జనవరి నెల నుంచి ఉపాధి పనులను కూలీలకు ఆయా మండలాల్లో కేటాయించారు. కనీసం వారికి ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని అందువల్ల తాము పనులకు వెల్లలేక పోయామని పలు మండలాల్లో కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు 2020-21, 2021-22 సంవత్సరాలకు గాను దాదాపు నాలుగు దఫాలుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశాలు నిర్వహించారు. ఈ సోషల్ ఆడిష్ వేదిక సభల్లో పలు మండలాల్లో ఉపాధి పథకానికి సంబంధించిన పనుల్లో దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాల్సిందిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక సాక్షిగా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇంత వరకూ కొన్ని మండలాల్లో అధికారులు ఆదేశించిన రికవరీలను చేయలేదని తెలిసింది. ఆ ఏపిడి కార్యాలయ పరిధిలో పలు కార్యాకలాపాలు ఆసాంతం రహస్యంగానే నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అంతే కాక వారు చేసే ప్రతి పని మర్మదేశాన్ని తలపిస్తున్నట్లు పలువురు యద్దేవా చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కదిరి ఏపిడి కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# 11న తడక మహోత్సవం

## - కొండపై రహదారి ఏర్పాటు




కొండపై వెలసిన చంద్రాయుని(చెన్నకేశవ) స్వామి వద్ద పూజలు చేస్తున్న , జెసిబితో రోడ్డును చదును చేయిస్తున్న నిర్వాహకులు దృశ్యం



ఆలయం వద్ద భోజన ఏర్పాట్లు చేసిన దృశ్యం

**బుక్కపట్నం రూరల్, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**

బుక్కపట్నం మండల పరిధిలోని చంద్రాయునిపల్లి గ్రామసమీపంలో పత్రవరిమల కొండలలో వెలసిన భక్తుల కొంగు బంగారంగా కొలిచే శ్రీ చంద్రాయుని స్వామి (చెన్నకేశవులు)కి ప్రతి సంవత్సరం మాగమాసం మూడవ శనివారంలో తడక మహోత్సవ కార్యక్రమంను నిర్వహించడం ఆనవాయితీ. అయితే తరుగువాండ్లపల్లి గ్రామానికి చెందిన తరుగురెడ్లు, తంగెం వంశస్తుల పూజారులు ఆధ్వర్యంలో ఈ తడక మహోత్సవ కార్యక్రమం నిర్వహించడంజరుగుతుంది. ఈ తడకను మేదరవాళ్ళు వారం రోజుల పాటు ఉపవాసదీక్షతో ఉండి తడకను అల్లి సిద్ధం చేస్తారు. గతంలో భక్తాదులు స్వామి వారిని దర్శించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తంగెం వంశస్తులు చెన్నరాయునిపల్లి గ్రామం నుండి శ్రీ చంద్రాయుని స్వామి కొండమీదకు 6 కిలోమీటర్ల మేర జెసిబి సహాయంతో రాళ్ళను తొలగించి ట్రాక్టర్లు సహాయంతో మట్టిని తోలి రహదారి ఏర్పాటు చేయడం జరిగింది.(అనగా ఈ నెల 11వ తేదిన ఈ తడక మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కోడి కూత, రోకలి పోటి వినపడని ప్రాంతమైన ఎత్తైన గుండు ఎలకమానిపేంట, శిగరమాని పుట్ట, మునులు ఉండే కోన ముగిచింతల వనం, మొగలిమాను చలిమి ఉన్న ప్రాంతంలో స్వామి వారు వెలవడం ఒక విష్టతగా పేర్కొంటున్నారు. స్వామి వారిని దర్శించుకోవడానికి చుట్టు ప్రక్కల మండలాల నుండే కాకుండా కర్ణాటక ప్రాంతం నుండి సైతం భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# జెఎన్‌టియు అభివృద్ధిలో పూర్వపు విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

## - జెఎన్‌టియు విసి రంగ జనార్దన్



పూర్వపు విద్యార్థులతో జెఎన్‌టియు విసి రంగ జనార్ధన్

**అనంతపురం సిటీ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

జెఎన్‌టియు అభివృద్ధిలో పూర్వపు విద్యార్థుల సేవలు ప్రశంసనీయంగానిలుస్తున్నాయని జెఎన్‌టియు విసి రంగ జనార్దన్ పేర్కొన్నారు. జెఎన్‌టియుఎ పూర్వపు విద్యార్థులు 1958-63 కలయికను జెఎన్‌టియుఎ ఎలక్ట్రానిక్ విభాగం సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించారు. జెఎన్‌టియు ప్రిన్సిపాల్ సుజాత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి విసి రంగ జనార్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి రంగ జనార్దన్ మాట్లాడుతూ.. పూర్వపు విద్యార్థుల తోడ్పాటుతో కళాశాల, యూనివర్సిటీని మరింత ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా వారి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు పూర్వపు విద్యార్థులు మీ అనుభవాలు, సూచనలను అందించాలని సూచించారు. జెఎన్‌టియులో చదివిన ఎందరో పూర్వపు విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరడం, హర్షించ దగ్గ విషం అన్నారు. కళావల అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తున్నారని కొనియాడారు. పూర్వపు విద్యార్థి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జెఎన్‌టియు కళాశాల వల్ల తాము గొప్ప స్థాయికి ఎదిగామని, జెఎన్‌టియుఎ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. పూర్వపు విద్యార్థి మాజీ విసి బాలవీరారెడ్డి మాట్లాడుతూ.. పూర్వపు విద్యార్థులు కళాశాలకు రాయబారులు లాంటివారమని తమ సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తుంటామని పేర్కొన్నారు. అదే విధంగా పూర్వపు విద్యార్థి బాలక్రిష్ణమూర్తి ఈ సందర్భంగా జపనీస్ టెక్నాలజీ ద్వారా కళాశాలను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో వివరించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులకు కళాశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులతోపాటు రిజిస్ట్రార్ శశిధర్, పలువురు యూనివర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# హరిహర ఆలయంలో ధ్వజస్థంభ స్థాపన

**పుట్టపర్తి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**

హరిహర కాశీ విశ్వేశ్వరాయలయంలో ధ్వజస్థంభ స్థాపన ఘనంగా జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో వెలసి హరిహర దేవాలయంలో ధ్వజస్థంభ స్థాపన



ఎనుముపల్లిలో హరిహర క్షేత్రంలో ధ్వజ స్తంభ ఆరోహణ దృశ్యం



పూజల్లో పాల్గొన్నా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దృశ్యం

గురువారం నాడు భక్తి భావంతో నిర్వహించారు. ఋత్వికులు నాగరాజశర్మ బృందం కళశ స్థాపన, జ్యోతి ప్రజ్వలన, మహాగణపతి హోమం, యంత్ర పూజ, ధ్వజస్థంభాభిషేకం, అష్టోత్తర పూజ, ఋత్వికులు నిర్వహించారు. రాయలసీమలోని అతిపెద్ద శివాలయం నిర్మాణం ముగింపు దశకు చేరుకుంది. సత్యసాయి బాబా అవతరించిన పవిత్ర చిత్రావతి నది ఒడ్డున పుట్టపర్తి సమీపాన వెలసిన హరిహర దివ్య క్షేత్రం ధ్వజస్థంభారోహణగావించారు. ఆలయ ధర్మకర్తగా వ్యవహరిస్తున్న శ్రీరాములు ఆధ్వర్యంలో అశేష భక్తాదులు పాల్గొన్నారు. సుమారు మూడు కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం జరుగుతోంది. రెండస్తుల ఆలయంపై ధాన్యం నిద్రలో ఆసీనులైన పరమేశ్వరుని భారీ ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నది.

**పర్యాటక కేంద్రంగా హరిహర క్షేత్రం -పల్లె రూ.లక్ష వితరణ :** శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లిలో వెలసిన హరిహర క్షేత్రం పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోందని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాడు ధ్వజస్థంభ ఆరోహణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం లక్షరూపాయలను అందిస్తానని ప్రకటించారు. గతంలో కూడా ఆలయ నిఆర్మణం కోసం స్టీల్ అందించడం జరిగిందన్నారు. పవిత్ర చిత్రావతి నది సమీపాన వెలసిన ఈ ఆలయం పార్యటకులకు, భక్తులకు ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని శివనామస్మరణతో మారుమ్రోగించారు. అనంతరం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

# సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తున్నాం

## - ఎమ్మెల్యే తిప్పేస్వామి



గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

**అగళి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తున్న ప్రభుత్వం వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నర్సాంబూది గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు తమకు ఉచితంగా ఇసుక కావాలని ఎమ్మెల్యేను అడగగా రీచ్‌లను గుర్తించి ఇసుకను అందజేస్తామని అన్నారు. మరోసారి ఎన్నికల్లో తనను, ముఖ్యమంత్రి జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లావణ్య, ఎంపిడిఓ శ్రీనివాసులు, ఆర్ఐ గుర్రన్న, ఏఓ శేఖర్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ శివన్న, మండల వైకాపా కన్వీనర్ మహేంద్ర, సీనియర్ వైఎస్ఆర్‌సిపి నాయకులు తిప్పేస్వామి, ఎంపిపి రేణుకా కామరాజు, వైస్ ఎంపిపి గాయత్రి హేమంత్, సర్పంచులు వెంకటస్వామి, నటరాజు, ఎంపిటిసి సురేష్, సతీష్, అన్ని శాఖల ఉద్యోగులు ఉన్నారు.

# ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీసులతో డిఐజి టెలీ కాన్ఫరెన్స్



టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎటిపి రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల సిఐలు, ఆ పై స్థాయి పోలీసు అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. రాజీ మార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాల వారికి తెలియజేసి ఎక్కువ కేసులను పరిష్కారం అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా దర్యాప్తు అధికారులు యుఐ కేసుల తగ్గింపు నిమిత్తం సంబంధిత న్యాయమూర్తులతో సంప్రదించి పెండింగ్ కేసులను తగ్గించేలా కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఘటనలకు తావుండరాదన్నారు. రానున రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుకుగా పని చేయాలని, ముందస్తు సమాచారం సేకరణలో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి, రాహుల్‌దేవ్‌సింగ్, ఆయా జిల్లా పోలీసు కార్యాలయాల నుంచి రెండు జిల్లాల పోలీసు అధికారులు ఆయా పోలీసు కార్యాలయాలు/పోలీస్‌స్టేషన్ల నుంచి పాల్గొన్నారు.

# సరిహద్దు సెబ్ అధికారులు నిఘా పెంచండి

## -కేసులు ఛేధింపులో పురోగతి సాధించండి

## -ఎస్.పి.రాహుల్ దేవ్ సింగ్



సెబ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పి, ఎఎస్పిలు

**పుట్టపర్తి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త**

అంతరాష్ట్ర సరిహద్దులో నిఘా పెంచాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పి రాహుల్‌దేవ్ సింగ్ పేర్కొన్నారు. గురువారం నాడు పుట్టపర్తి ఎస్పి కార్యాలయంలో ఆయన ఎఎస్పి రామకృష్ణ ప్రసాద్‌తో కలసి సెబ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల పనితీరు, వాటి ఫలితాలపై వాకబు చేశారు. అంతరాష్ట్ర సరిహద్దుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాలలోఉన్న చెక్‌పోస్టులలో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మద్యం, అక్రమ రవాణా నాటుసారా తయారీ, వాటి దుష్పరిణామాలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్ళాలన్నారు. ఎన్‌డిపిఎస్ 1985 యాక్ట్ ప్రకారం అటువంటి వారు నేరస్తులుగా పరిగణించి శిక్షకు గురవుతారని, అవగాహన కల్పించాలన్నారు. వివిధ సెబ్ స్టేషన్‌లలో ఉన్న పెండింగ్ కేసులు, వాటి వివరాలు త్వరగా పూర్తీ చేసి కోర్టులో కేసు నెంబర్ తీసుకొని సిసిటిఎన్ఎస్ అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలోన మద్యం విక్రయాల గురించి మార్గదర్శకాలు చేశారు. ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా మద్యం సరఫరా చేసే, నాటుసారా తయారీ, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమ రవాణా, వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి నేరాలకు ఒడిగడితే బ్_ ం డో వ ం ్ల చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పి రాహుల్‌దేవ్ సింగ్‌తో పాటు సెబ్ అధికారి ఎఎస్పి రామకృష్ణ ప్రసాద్, సూపరిం టెండెంట్ రవికుమార్, జిల్లా సెబ్ సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నడ సాహిత్యపరిషత్ సమ్మేళనంకు డా.అరవింద్‌పటేల్ అధ్యక్షుడిగా ఎన్నిక



డా.అరవింద్‌పటేల్

**బళ్లారి, ఫిబ్రవరి09, ప్రభాతవార్త ;**

ప్రముఖ కన్నడ రచయిత, సాహితీవేత్త డా.అరవింద్‌పటేల్‌ను 22వ కన్నడసాహిత్య సమ్మేళనం అధ్యక్షుడిగా నియమించినట్లు బళ్లారి జిల్లా కన్నడసాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్టి రు ద్రప్ప తెలిపారు. ఈనెల 5వ తేదీన స్థానిక కన్నడభవనంలో జిల్లా అధ్యక్షుడు డా.నిష్టిరుద్రప్ప అధ్యక్షతలో జరిపిన సభలో అఖండ బళ్లారిజిల్లా కన్నడసాహిత్య సమ్మేళనాన్ని ఈనెల 28, మార్చి 1వ తేదీల్లో రెండు రోజులపాటు బళ్లారిలో నిర్వహించేందుకు కన్నడసాహిత్య పరిషత్ కార్యవర్గసమితి సభ తీర్మానించిందని పేర్కొన్నారు. బళ్లారికి చెందిన వైద్యుడు, కవి, రచయిత, అనువాదకుడు అయిన డా.అరవింద్‌పటేల్ 22వ కన్నడసాహిత్య సమ్మేళనం సర్వాధ్యక్షుడుగా కార్యవర్గసమితి ఆమోదం తెలిపినట్లు గౌరవ కార్యదర్శి డా.శివలింగప్ప హందిహాళ్ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేసి రాబోయే ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

## - మంత్రి ఉషాశ్రీ చరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

**కళ్యాణదుర్గం టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం పట్టణ కేంద్రంలోని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్‌క్యాంపు కార్యాలయంలో కళ్యాణదుర్గం మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన గృహ సారథుల శిక్షణ కార్యక్రమంకు మంత్రి ఉషాశ్రీ చరణ్ ముఖ్య అతతిథగా హాజరై మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంపై గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు దిశ నిర్దేశం చేశారు.

# వెంకటాంపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

**యల్లనూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

జగనన్న మూడున్నర ఏళ్ల పాలనలో రాష్ట్రంలోని ప్రతి గడపకు అర్హతల ప్రకారం సంక్షేమ పథకాలు అందుతున్నాయని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకటాంపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైకాపా జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, రాష్ట్ర విద్యా ప్రభుత్వ సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డిలు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

హాజరయ్యారు. ముందుగా వారికి వైకాపా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందరికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ఒరవడికి మన ముఖ్యమంత్రి జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం అర్హులైన పేదలకు పథకాలను ఎలా కత్తిరించాలనే ఆలోచనతో పరిపాలన చేయగా నేడు మన జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి మరీ లబ్ధి చేకూర్చుస్తోందన్నారు. పారదర్శక పాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి విజయశేఖర్ నాయుడు, జెడ్‌పిటిసి భోగాతి ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ ంకర్‌రెడ్డి, సర్పంచులు కవిత, రామాంజులరెడ్డి, నాగరాజు, వైకాపా నాయకులు మహేశ్వర్‌రెడ్డి, బాలవెంకటరెడ్డి, నాగలింగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి చైతన్య, రూరల్ సిఐ చిన్నపెద్దయ్య, ఎస్ఐలు రామకృష్ణ, వెంకటప్రసాద్‌లు బందోబస్తు నిర్వహించారు.

# వ్యాపారుల, జీవన విధానం, కొరకే మార్కెట్‌నిర్మాణం

## - ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి




వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి , కూరగాయల మార్కెట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

**ధర్మవరం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

వ్యాపారుల, జీవన విధానం, ప్రజా సంక్షేమమే ప్రభుత్వం యొక్క లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారంపట్టణంలోని నూతన కూరగాయల మార్కెట్ షాపింగ్‌కాంప్లెక్స్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా పూజలు నిర్వహజంచి, అనంతరం కూరగాయల మార్కెట్ ఆవరణలో నిర్మించిన కీర్తిశేషులు, వైఎస్ఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

అనంతరం మార్కెట్, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తదుపరి 102 గదులను ఎమ్మెల్యేతోపాటు చైర్మన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్లు పేనుజురి నాగరాజు, భాగ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఈఈ సత్యనారాయణ, తదితరులచే గదులకు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభింపజేశారు.

అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. 1.79 ఎకరాల్లో 8 కోట్ల వ్యయముతో ఈ నూతన కూరగాయల మార్కెట్ షాపింగ్ కంప్లెక్స్ భవనాలను పూర్తి చేయడం నిజంగా సంతోషదాయకమన్నారు. కేవలం 13 నెలల వ్యవధిలో 102 గదులు 51 షెడ్లు నిర్మిణం చేపట్టడం జరిగిందన్నారు. గతంలో మార్కెట్ నుంచి 28వేలరూపాయలు ఆదాయం వచ్చేదని నేడు దాదాపు రెండు లక్షల వరకు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్లు పెనుజూరి నాగరాజు, భాగ్యలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు, పట్టణ వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరి రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చుకుందాం...

## వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమలులో ఉంది.. జర జాగ్రత్త... - డిఎస్‌పి యు.నరసింగప్ప

**గుంతకల్లు, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త**

నిరుపేదల పాలిట శాపంగా పరిణమిస్తున్న పేదరికంను ఆసరాగా చేసుకుని పలువురు వారి పట్ల విచక్షణ కోల్పోతూ వెట్టి చాకిరి పనులను పురమాయించడం చట్ట ప్రకారం నేరమని గుర్తించాలని, అలాంటి వారి పట్ల వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమలుతో కేసులు నమోదుకు వెనుకాడే ప్రశ్నేలేదని, జర జాగ్రత్త అంటూ గుంతకల్లు డిఎస్‌పి యు.నరసింగప్ప హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు వన్‌టౌన్, టూటౌన్ సిఐలు కె.రామసుబ్బయ్య, పి.గణేష్‌ల పర్యవేక్షణలో ఆయనతో పాటు మున్సిపల్ కమీషనర్ బండి శేషన్నలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుండి ఓ కళాశాలకు చెందిన దాదాపు 150మంది విద్యార్థులచే పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా పొట్టిశ్రీరాములు కూడలి వరకు ర్యాలీగా సాగి మానవహారంగా ఏర్పడి వెట్టి చాకిరి నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రాథమిక హక్కులు, వెట్టిచాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కల్పించారు. నిరుపేదలు వెట్టిచాకిరి పనిలో చిక్కుకుని



విధ్యార్థులచే మానవహారంగా ఏర్పిడి ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు.

కొట్టుమిట్టాడుతున్న వారి వివరాలను సేకరణతో అలాంటి నేరాలను ప్రోత్సహించకుండా తమ పోలీసు శాఖకు సమాచారం ఇచ్చి వారి రక్షణకు సహకరించాలన్నారు. ఎవరైనా ముందస్తుగా రుణంగా డబ్బును అందించి వ్యక్తుల నియామక పద ్ధతిని మానుకోవాలని, అది చట్ట ప్రకారం నేరమన్న సత్యాన్ని హితవుగా అవగాహన కల్పించారు. చట్టం అమలుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంను వెట్టి చాకిరి రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం అందించిన స్వేచ్ఛతో కూడిన ప్రాథమిక హక్కులు అందరికీ ఆమోదయోగ్యంగా లభ్యమయ్యేలా భారతీయ పౌరులుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శస్త్ర కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయండి

- నగర మేయర్ మహ్మద్ వసీం



పనులను పరిశీలిస్తున్న నగర మేయర్ వసీం

**అనంతపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

నగరంలో జరుగుతున్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులకు నగర మేయర్ మహ్మద్ వసీం సూచించారు. నగరంలోని 37వ డివిజన్ పరిధజలో రూ.40లక్షలతో జరుగుతున్న సిమెంట్ రోడ్ పనులను గురువారం నగర మేయర్ మహ్మద్ వసీం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకుని త్వరితగతిన, నాణ్యతతో పనులు పూర్తి చేయించాలని సూచించారు. అదే విధంగా 32వ డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ 46వ సచివాలయంను మేయర్ వసీం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం ఆదర్శనగర్ అంగన్‌వాడీ స్కూల్ తనిఖీ చేసి చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఆయా కార్యక్రమంలో కార్పోరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఖాజా, శీనాతోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శతాధిక కవి సమ్మేళనంకు తరలి రండి

- **శ్రీశ్రీ కళావేదిక పోస్టర్ ఆవిష్కరించిన అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు కింగ్ ఇంద్ర**

**అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమలాపుపరంలో మార్చి 12న జరిగే శోభకృత్ నామ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనంకు తరలిరావాలని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షులు కింగ్ ఇంద్ర పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌సారధ్యంలో డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మార్చి 12వ తేది అమలాపురంలోని సర్‌సివి రామన్ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో జరగనున్న ఉగాది జాతీయ శతాధజక కవి సమ్మేళనం పోస్టర్‌ఖు గురువారం తిరుపతిలో కింగ్ ఇంద్ర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి అరవ జయపాల్, సురేష్‌రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియపై అవగాహన

**పామిడి, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త**



అవగాహణ కల్పిస్తున్న షేక్ నభీరసూల్

భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకుని భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలువాలని ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ షేక్ నభీరసూల్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్ యువతకు పిలుపునిచ్చారు. పట్టణం లోని ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహణ కల్పించారు. ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి విచక్షణతో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. అవినీతిపరులు, నేర చరిత్ర కలిగిన వారంతా ఎన్నికల్లో పోటీ చేయటం ద్వార ప్రజాస్వామ్యం ఖూని అవుతోందన్నారు. సమాజాభివృద్దిలో బాగస్వాములై దేశాభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఈకార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కోరి చంద్రశేఖర్, సమాచారహక్కు పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు హోన్నూరప్ప, వినియోగదారుల సంఘం సభ్యులు కల్లూరు గురూజీ, పట్టణ జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి ఓబిరెడ్డి, కళాశాల ప్రిన్సిఫల్ సుబ్బరాయుడు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం..!

**ఆత్మకూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



ఆసుపత్రి సమీపాన పేరుకుపోయిన చెత్త

మండల కేంద్రమైన ఆత్మకూరులో గల ఎమ్మార్సీ భవనం,ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ చెత్త చెదారం అక్కడే నిలువ ఉండి దుర్వాసన వెదజల్లుతూ రోగాలుకు నిలయంగా మారుతోంది. ఆసుపత్రి సమీపాన ఉన్న కాలనీ ప్రజలు సత్యసాయివాటర్ పంప్‌కు పోయే దారిలో చెత్తచెదారం వెయడంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుంది.సమీపాన గల విద్యార్థులకు,దారి గూండా పోయే బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.చెత్త తొలగించి పరిసరాలును పరిశుభ్రంగా ఉంచాల్సిన పంచాయితీ అధికారులు నిద్రావస్థలో ఉండటం కారణంగా దోమలు ప్రబలి రోగాలకు నిలయంగా మారుతున్నాయి.పంచాయితీ సిబ్బంది చెత్త తరలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామప్రజలు డిమాండ్‌చేస్తున్నారు.

## సదరం క్యాంపు వాయిదా

**శింగనమల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



డా.రమణానాయక్

మండల కేంద్రంలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో నేడు జరగాల్సిన సదరం క్యాంపును కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు డాక్టర్ రమణానాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదలచేస్తూ నేడు జరగాల్సిన సదరం క్యాంపును వచ్చే శుక్రవారం 17/02/2023వ తేదిన నిర్వహిస్తున్నామని నేడు క్యాంపుకు హాజరయ్యే వారందరూ అదే రోజు హాజరు కావాలని కోరుతున్నట్లు కమ్యునిటీ హెల్త్ సెంటర్ పర్యవేక్షణ అధికారి డా.రమణానాయక్ పేర్కొన్నారు.

## 28న జగనన్న విద్యాదీవెన తొలివిడత మంజూరు

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ఫిబ్రవరి 28న 2022-23 విద్యా సంవత్సరానికిగాను తొలివిడత జగనన్న విద్యాదీవెన ఈ నెల 28వ తేదిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ సంచాలకులు కె.హర్షవర్ధన్ పేర్కొంటూ అందుకు చేపట్టవలసిన సన్నాహక చర్యలు సకాలంలో పూర్తి చేయవలసినదిగా సూచనలు జారీ చేశారు. అందు ముఖ్యమైన విద్యార్థులు, వారి తల్లులు సంబంధిత గ్రామ/వార్డు సచివాలయాలలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ లాగిన్‌లో ఫైవ్ స్టెప్ వెరిఫికేషన్ చేయించుకోవాలని, అలాగే మునుపటి విడత జగనన్న విద్యా దీవెన అందుకున్న తల్లులు ఎవరైతే ఇంకా కళాశాలకు మొత్తాన్ని చెల్లించకుండా ఉంటారో వారు తక్షణమే కళాశాలకు ఆ మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని, ఇంకా కళాశాల ఫీజు చెల్లించని తల్లులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ బాధ్యత. అనర్హులైన విద్యార్థులకు నోటీసులు జారీ చేసి వారికి అనర్హతపై ఏదైనా అభ్యంతరం ఉంటే వెంటనే అభ్యంతరమును దరఖాస్తు రూపముగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీలు పొంది పున:విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవలెనని తెలిపారు.

## ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోవాలి

- టిడిపి శ్రేణులు డిమాండ్



తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**రాప్తాడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో వైసీపీ నాయకుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని పుల్లలరేవు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మండల వైసీపీ నాయకుని అండతో ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని నిరసిస్తూ గురువారం రాప్తాడులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం ఎదుట భైఠాయించి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. పుల్లలరేవు గ్రామానికి సంబంధించిన సర్వే నెంబర్ 103లో 14.57 ఎకరాల భూమిలో గతంలో చెత్త సంపద కేంద్రం, గ్రామంలో పేదలకు ఇంటి పట్టాల కోసం కేటాయించిన రూ. కోట్ల విలువ చేసే గాజుబండ భూమిని వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆన్‌లైన్‌లో అక్రమంగా నమదు చేయించుకున్నారని ఆరోపించారు. అదే విధంగా భోగినేపల్లి గ్రామానికి సంబంధించిన టీడీపీ సానుభూతిపరులు ఇంటి స్థలం వివాదంలో కోర్టు స్టే ఉన్నా కూడా అధికార బలంతో స్టేను ధిక్కరించి ఇల్లు నిర్మాణం చేపట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అనంతరం తహశీల్దారు లక్ష్మినరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, సర్పంచులు నరేష్, ఎంపిటిసిలు జాఫర్, రవి, గంగలకుంట రమణ, కిష్ణ, మాజీ ఎంపిటిసి సాయి, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, మరూరు గోపాల్, బోయ గోపాల్, రామకృష్ణ, స్వర్ణక్క, వెంకటేష్, లక్ష్మన్న, కిషోర్, పంపునారాయణ, విశ్వనాథరెడ్డి, కొత్తపల్లి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి స్టిక్కర్ల అతికింపా

- **వైసిపి ప్రభుత్వం తీరుపై ధ్వజమెత్తిన అనంతపురం జిల్లా టిడిపి నాయకులు**

**అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి, మరో 40 ఏళ్ల వెనక్కి నెట్టి.. ఏం సాధించారని ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అతికించుకోవాలని తెలుగు దేశం రాష్ట్ర అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామియాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు డిష్ నాగరాజు, వైసీపీ ప్రభుత్వం తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం తెలుగుదేశం పార్టీ అర్బన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యావసరాల ధరలతోపాటు పెట్రోల్ ధరలు, కరెంటు బిల్లులు, బస్ చార్జీలు, ఇంటిగుత్త, పెంచినందుకు మీ స్టిక్కర్లు అతికించుకోవాలా అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తి అడుగంటి పోయిందని, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు బతకడానికి ఇబ్బంది పడుతున్నారని, మరోవైపు ఉద్యోగులు ప్రతి నెలా జీతాలు అందక సతమతవుతున్న తరుణంలో మీరు ఏం సాధజంచారని స్టిక్కర్లు ప్రతి ఇంటికీ అతికించుకోవాలో చెప్పాలన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేదం అని, ప్రతి సందుకు మద్యం షాపు పెట్టి దోచుకుంటున్నారని, ఇసుక సామాన్య మానవులకు అందనంత దూరంలో ధరలు పెంచారన్నారు. రాష్ట్రంలో మీరు నాలుగేళ్ల పాలనలో ఏమి అభివృద్ధి సాధించారో చెబితే అప్పుడు మేము స్టిక్కర్లు, అంటించుకుంటామని పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రజలు వైకాపా నాయకుల మూతులకు స్టిక్కర్లు అతికిస్తారని చురకలు అందించారు.

## నేడు కార్పోరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్న కార్పోరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏపిఎస్ఎఫ్, బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైఖ్య ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని గురువారం ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్‌లో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్ మాట్లాడుతూ.. అనంతపురం నగరంలో రెండు రోజుల క్రితం నారాయణ జూనియర్ కళాశాలలో ఫీజుల కోసం విద్యార్థులను వేదిస్తుండటంతో విద్యార్థి ఆత్మమత్య ప్రయత్నం చేసిందన్నారు. దీనికి కారణమైన విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేరశారు. కావున రేపు జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతున్నామని, ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి రమణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమా మహేష్, నాయకులు ఆనంద్ నారాయణస్వామి, ఆనంద్, మంజు, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు



కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్న పోలీసులు



**రాప్తాడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ మోహన్, ఎస్ఐ పి.వై.ఆంజినేయులు పేర్కొన్నారు. గురువారం తెల్లవారు జామున మండల పరిధిలోని ప్రసన్నాయనపల్లి గ్రామంలో నాకాబంది, కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రౌడీ షీటర్, ట్రబుల్ మంగర్స్ ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. అదే విధంగా చిన్మయ నగర్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి హెల్మెట్ ధారణపై సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి కూరగాయల మార్కెట్ వేలంపాట వాయిదా

**అనంతపురం ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

అనంతపురంలో నగరపాలక సంస్థ పరిధిలోని నేడు జరుగవలసిన కూరగాయల మార్కెట్ వేలం పాట కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి వేలం పాట నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలియజేశారు.

## వెట్టి చాకిరీ నిర్మూలనకు అందరం కృషి చేద్దాం



నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

**అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు వెట్టిచాకిరి నిర్మూలన దినం పురస్కరించుకుని అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, దిశ డిఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం అనంతపురం నగరంలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 2వేల మంది విద్యార్థినిలు, 150 మంది పోలీసుల, ఐసిడిఎస్, డిసిపియు, సిడబ్ల్యూసి, సోషల్ వెల్ఫేర్, చైల్డ్‌లైన్ 1098, లేబర్, రెవెన్యూ శాఖల సిబ్బందితో మానవహారం, భారీ ర్యాలీలు కొనసాగాయి. వెట్టి చాకిరిని నిర్మూలిద్దాం.. బాలలకు మంచి భవిష్యత్తు నిద్దాం. బాలల హక్కులను కాపాడుదాం. అంటూ నినాదాలతో స్థానిక కెఎస్ఎన్ కాలేజీ నుంచి ర్యాలీని ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్ వద్ద మానవ హారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. సిఐడి శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు నుంచి 15వ తేది వరకు వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా బాండెడ్ లేబర్ సిస్టంను నిర్మూలించడం కోసం ఆపరేషన్ స్వేచ్ఛ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి డా.శ్రీదేవి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, అనంతపురం డిఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిఐలు రవిశంకర్‌రెడ్డి, శివరాముడు, కత్తి శ్రీనివాసులు, పలువురు ఎస్సైలు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పిఆర్‌టియు ఎపి ఆవిర్భావ దినోత్సవం



పిఆర్‌టియు ఎపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

పిఆర్‌టియు ఎపి అనంతపురం జిల్లా శాఖ పక్షాన నేడు పిఆర్‌టియుఏపి ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం ఉపాధ్యాయ భవన్ పక్కన ఉన్న బాలికల హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ముందు ఉంటుందన్నారు. అనంతపురం జిల్లా నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి పిఆర్‌టియు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోపిఆర్‌టియు సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి బాబయ్య, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు

- వైస్ ఎంపిపి బోయ రామాంజినేయులు

**రాప్తాడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి బోయ రామాంజినేయులు

వైసీపీ ప్రజా ఆదరణ చూసి ఓర్వలేక టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైస్ ఎంపిపి బోయ రామాంజినేయులు పేర్కొన్నారు. అక్రమంగా ప్రభుత్వ భూములను స్వాహా చేసి ఇప్పుడు వాల్మీకుల చేసుకున్న భూమిని ప్రభుత్వ భూమి అంటున్నారు. అని టీడీపీ నాయకుల మీద మండి పడ్డారు. గురువారం స్థానిక మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో టిడిపి నాయకుల మీద మండిపడ్డ వైస్ ఎంపిపి బోయ రామాంజినేయులు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ.. గతంలో 2001వ సంవత్సరంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పుల్లలరేవు గ్రామంలో ఉన్న కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు సర్పంచు పదవి కోసం వాల్మీకుల దగ్గరకు వచ్చి నామినేషన్ చేయమని వాళ్ల కాళ్ల మీదపడి, మీరు ఆ పనిచేస్తే మీకు మా భూమిని ఇస్తామని చెప్పి సర్పంచు పదవి రాగానే ప్రభుత్వ పోరంబోకుగా ఉన్న భూమిని పంచాయితీ రేజిలేషన్ ఇచ్చి ఒక వంద రూపాయలు చలానా కట్టించి అసైన్డ్‌మెంట్ భూమిగా మార్చి వాల్మీకులకు ఇవ్వడం జరిగింది. అదే విధంగా అప్పుడు కమ్మ సామాజిక వర్గానికి కొమ్ము క ఆసినందుకు భూమిని ఇచ్చి ఇప్పుడు వారికి కొమ్ము కాయనందుకు అది ప్రభుత్వ భూమి అవి అంటున్నారు. అప్పుడు సర్పంచు పదవిలో ఉండి ఆయనే స్వయంగా సంతకం చేసి ఇవ్వడం కూడా జరిగింది. 2001 నుంచి వాల్మీకులు సాగు చేసుకుంటూ ఉంటే ఇప్పుడు వైసీపీ నాయకులు అండతో ఆన్‌లైన్‌లో చేశారు. అని అనడం ఎంత వరకు న్యాయం అని అన్నారు. వారు ఎప్పుడూ గుర్తుకు రానిది ఇప్పుడు మాట్లాడడం ఎలక్షన్స్ టైం దగ్గరకు వచ్చిందని ప్రజలలో ఉన్న వైసీపీ ప్రభుత్వ మీద ఆదరణ చూసి ఓర్వలేక ఇలా అసత్య ఆరోపణలు, ప్రచారాలు చేస్తున్నారు. ఖబర్దార్, టిడిపి నాయకులరా అన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకుల సంఘం నాయకులు, పుల్లలరేవు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణులను విస్మరించొద్దు

**అనంతపురం టౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న విబి.భాస్కర్ బాబు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నాయీబ్రాహ్మణులకు దేవాలయ ట్రస్టులో సభ్యులుగా అవకాశం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, పంచ వృత్తుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్‌బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులను విస్మరించొద్దని, పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అలాగే సీఎం అయిన వెంటనే చట్టసభల్లో విశ్వబ్రాహ్మణులకు తాళిబొట్టు అధికారాన్ని కల్పించే విధంగా జీవో ఇస్తామని ఇచ్చిన కల్పించే విధంగా జీవో ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే మూడున్నర సంవత్సరం పూర్తి అయినందున ఇక ఆలస్యం చేయకుండా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని భాస్కర్‌బాబు, ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

## ఇటీవల వెలువడిన ప్రకటనకి ఎన్ఎస్‌యుఐకి ఎటువంటి సంబంధం లేదు

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్ ఆదేశాల మేరకు విద్యా సంస్థల బంద్‌కి ఎన్ఎస్‌యుఐకి ఎటువంటి సంబంధం లేదని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేసు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగర అధ్యక్షులు పేరుతో నగర విద్యా సంస్థల బంద్ అని ప్రకటన ఇవ్వడం జరిగింది. ఈ ప్రకటనకి, ఆ ప్రకటన ఇచ్చిన ఎన్ఎస్‌యుఐకి ఎటువంటి సంబంధం లేదని రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా అధ్యక్షులు ఓబులేసు విద్యా సంస్థల యాజమాన్యానికి, పోలీసులకి సవినయంగా తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

## వివాహ వేడుకల్లో బండారు శ్రావణిశ్రీ



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెరవలి గ్రామంలో టిడిపి కార్యకర్త సురేంద్ర-రజిని వివాహ వేడుకల్లో గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధువరులను ఆమె ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు టీడీపీ నాయకులు చిదానందనాయుడు, మారుతినాయుడు, వెంకటరాముడు, మారుతిప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ ప్రారంభం

- సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి

**శింగనమల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న బొమ్మనశ్రీరామిరెడ్డి

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గురువారం సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి నూతన ఆధార్ షెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఆధార్‌లో ఏవైనా మార్పులు చేర్పుల కొరకు మండల పరిధిలోని కొరివిపల్లి గ్రామ సచివాలయానికి ప్రజలు వెళ్తుండేవారని అయితే నేడు విడతల వారీగా మండల పరిధిలోనే అన్ని గ్రామ సచివాలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ షెంటర్లు ఏర్పాటు చేస్తోందని, అందులో భాగంగా శింగనమల గ్రామ సచివాలయాల్లో నూతన ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నిర్మలాకుమారి, ఈఓఆర్డి శివనారాయణ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి రామాంజినేయులు, వీఆర్ఓ ఎరితాతయ్య, సోషల్ వెల్ఫేర్ అధికారి నాగేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ నాయక్, మహిళా పోలీసు సరిత, ఏఎన్ఎం శైలజా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయశ్రీ, వైసీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ బోర్డ్ భూములన్నీ సంపూర్ణంగా మైనార్టీ నిరుపేదలకు వినియోగించాలి

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**



భారత ప్రభుత్వ మైనార్టీ కమిషన్ మెంబర్ సన్మానిస్తున్న జిల్లా మైనార్టీ మొర్చా అధ్యక్షులు

భారత ప్రభుత్వ మైనార్టీ కమిషన్ మెంబర్ షేహజాదిను జిల్లా మైనార్టీ మోర్చ అధ్యక్షులు మొహమ్మద్ సాధిక్ బాషా కలిసి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మరియు కదిరికి సంబంధించిన వక్ఫ్ భూములను ప్రజా ప్రతినిధుల అనుచరులు కబ్జాకు పాల్పడుతున్న కూడా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, వక్ఫ్ భూములు అన్ని సంపూర్ణంగా ముస్లింలకు, బీడి కార్మికులకు,ముస్లిం నిరుపేదలకు వినియోగించాలని కోరడం జరిగింది. భారత ప్రభుత్వ మైనార్టీ కమిషన్ మెంబర్ షేహజాది సానుకూలంగా స్పందిస్తూ దీనిపైన పూర్తి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ బజ్జన్, జిలా ఉపాధ్యక్షులు సలీం, మండల అధ్యక్షులు రామో్మహన్‌లు పాల్గొన్నారు.

## గర్భిణీ మహిళలకు వైద్య చికిత్సలు

**గాండ్లపెంట, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారి మారుతి మహేశ్వర్ గర్భిణీ మహిళలకు గురువారం వైద్య చికిత్సలు అందజేశారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి గర్భిణీ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్యాధికారి తెలియజేశారు. మొత్తం 41 మంది హాజరు కాగా ఇందులో హైరిస్క్ కలిగిన 25 మంది గర్భిణీలను గుర్తించినట్లు వైద్యాధికారి తెలిపారు. ముఖ్యంగా వీరికి వైద్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఇందులో రక్తహీనత కలిగిన వారికి ఐరన్, సుక్రోస్ ఇంజెక్షన్‌లు ఇచ్చారు. ముఖ్యంగా గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి బాబా ఫక్రుద్దీన్, హెల్త్ సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదనపు గదుల నిర్మాణం కోసం దాతలు సహాయం

**నల్లచెరువు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పుణ్యక్షేత్రమైన శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కొరకు తమ వంతు దేవస్థానంకు విరాళంగా 10 అదనపు గదులు నిర్మించడానికి పాలక మండలి సభ్యులు దేవరింటి రెడ్డి భాస్కర్‌రెడ్డి నిర్ణయించగా దాతలు ముందుకు వచ్చారు. అదనపు గదులకు సహకరించిన దాతలు కదిరికి చెందిన నాగూరి రామచంద్రారెడ్డి, పి.కొత్తపల్లికి చెందిన గోవిందు దామోదర్‌రెడ్డి, నల్లచెరువు మండలానికి చెందిన పాలెం సుధాకర్‌లు సహకరించారు. మిగితా 6 గదులకు దాతలు మందుకు వస్తే నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆలయ చైర్మెన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించదలచిన వారు 9949992578 నెంబర్‌కు సంప్రదించాలని తెలియజేశారు.

## 11, 12 తేదీల్లో హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్ ఫిబ్రవరి 2023 జరగబోయే పరీక్షలు కడపలో నిర్వహించబడుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. అభ్యర్థులు హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్ ఈ నెల 11, 12 రెండు రోజులు ఉదయం 10 నుంచి 1:00 వరకు మొదటి పేపర్, 2వ పేపర్ పరీక్షలు నిర్వహించబడుతాయి. కావున అభ్యర్థులకు తెలియజేయడం యేమనగా హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో ఉంచబడ్డాయని, అభ్యర్థులు తమ హాల్ టికెట్స్‌లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లో చేసుకోవచ్చున్నారు.

**GUNTAKAL MUNICIPALITY**
**e procurement - Tender Notice**

| S. No | e -Tender Notification No | Name of the work | Estimate Cost Amt. |
|---|---|---|---|
| 1 | 43/2022/GENERAL FUNDS/ E3 dated:08.02.2023 short tender | Providing of CC Patches for Pot Holes at 1 to 9$^{th}$, 10$^{th}$ to 14, 15$^{th,}$ 16, 18,20,21,22,23,24,25,26,27,27,28, 26$^{th}$ to 33$^{rd}$ Sachivalayam - **4 Nos** | **Rs. 3.60 to 10.00 Lakhs** |
| 2 | 44/2022/GENERAL FUNDS/E3 dated:08.02.2023 Short tender | Engaging of Hire vehicles to Municipal Chairperson, Municipal Commissioner, Municipal Engineer,S/d of Scanneer and O.S. Installation,Engaging of Skilled Operators - **3 Nos** | **Rs. 3.75 to 12.60** |

Further details can been seen at e-procurement market place i.e., ***www.tender.apeprocurement.gov.in***

**Sd/- Commissioner, Guntakal Municipality.**

# పేద విద్యార్థుల చదువుకోసం మాస్టారు పోరాటం

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన చిత్రం సార్ (తెలుగు), , వాతి (తమిళ్) శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈచిత్రానికి సూర్యదేవర నాగవంశీ , సాయిసౌజన్య నిర్మాతలు. స్టార్ యాక్టర్ ధనుష్, సంయుక్తామీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈచిత్రం ఫిబ్రవరి 17న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.. ధనుష్ నటించిన తొలి తెలుగు సినిమా కావటంతో



భారీ అంచనాలు నెలకొన్నాయి.. తాజాగా హైదరాబాద్‌లోని ఎఎంబి సినిమాస్‌లో ఈచిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు.. హీరో ధనుష్, సంయుక్తా మీనన్, దర్శకుడు వెంకీ అట్లూరి తదితరులు పాల్గొన్నారు. ధనుష్ మాట్లాడుతూ, ఇది నాకు ప్రత్యేకమైన రోజుల అన్నారు. ఇది నా మొదటి తెలుగుసినిమా అని చెబుతూ, చాలా సంతోషంగా ఉందన్నారు. ఒకపుడు తెలుగు సినిమా, తమిళ సినిమా , కన్నడ సినిమా, హిందీసినిమా అనేవాళ్లని, కానీ ఇపుడు ఇండియన్ సినిమా అనటం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈకథ చాలా బాగుంటుందని అన్నారు. నాకు ఇంతమంచి సినిమా ఇచ్చినందుకు వెంకీఅట్లూరి గారికి ధన్యవాదాలు అన్నారు. చినబాబుగారికి, నాగవంశీ గారికి, త్రివిక్రమ్ గారికి, సంయుక్తమీనన్‌గారికి అందరికీ ధన్యవాదాలు అన్నారు. దర్శకుడు వెంకీ మాట్లాడుతూ, లాక్‌డౌన్ సమయంలో ఈ కథ రాసుకుని వంశీ గారికి విన్పించటం జరిగిందని ఆయనకు నచ్చిందన్నారు. ధనుష్ కథ చెప్పటానికి రమ్మన్నారని, ఈసినిమా ఆయన చేసినా చేయకపోయినా ఆయనకు కథ చెప్పానన్న సంతృప్తి నాకు చాలా అనుకున్నానని, కానీ ఆయన కథ వినగానే ఈసినిమా చేస్తున్నానని అనటంతో సంతోషం వచ్చిందనాన్రు. కార్యక్రమంలో సంయుక్తామీనన్, హైపర్ ఆది తదితరులు మాట్లాడారు.

# నాని 'దసరా' నుంచి సెకండ్ సాంగ్



నాచురల్‌స్టార్ నాని మోస్ట్ అవైటెడ్ పాన్‌ఇండియా మూవీ దసరా.. మాస్-అపీలింగ్ ప్రమోషనల్ మెటీరియల్‌తో భారీ అంచనాలను నెలకొల్పింది.. నాని మాసియెస్ట్ ఫస్ట్‌లుక్‌తో పాటు ఫస్ట్‌సాంగ్ ధూమ్‌ధామ్..కు మంచి స్పందన వచ్చింది.. టీజర్‌కు అనూహ్య స్పందన వచ్చింది.. తాజాగా మేకర్‌స దసరా సెకండ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు. వాలెంటైన్స్‌డేకు ఒక రోజు ముందు ఫిబ్రవరి 13న ఓరి వారి..అనే హార్ట్‌బ్రేకింగ్ సాంగ్‌ను విడుదల చేయనున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర




# 'అమిగోస్' బ్లాక్‌బస్టర్ హిట్ గ్యారెంటీ

రాజేంద్ర అనే కొత్త దర్శకుడిని ఇండస్ట్రీకి పరిచయం చేస్తూ , నందమూరి కల్యాణ్‌రామ్ అమిగోస్ అనే సినిమాను చేశారు.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈసినిమాను ఈనెల 10న భారీస్థాయిలో రిలీజ్ చేస్తున్నారు.. ఈనేపథ్యంలో ఈసినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు.. హీరో కళ్యాణ్‌రామ్ మాటాడుతూ, మైత్రీ నా హోమ్ బ్యానర్ వంటిదే అన్నారు.. రొటీన్‌కు భిన్నంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈసినిమా సినిమా చేశానని

## నందమూరి కళ్యాణ్‌రామ్

అన్నారు. తప్పకుండా పెద్ద హిట్ అవుతుందన్నారు.. ఒక దర్శకుడిగా రాజేంద్రగారు ఎంతగా కష్టపడ్డారనేది నేనుచేశానని అన్నారు.. ఈసినిమాను ఆయన పేరెంట్స్‌కు అంకితం చేస్తున్నా మని అన్నారు.. నిర్మాతలు మాట్లాడుతూ, ఇవాళ ఉదయమే ఎన్టీఆర్ గారు ఈసినిమానుచూశారని అన్నారు.. పెద్ద హిట్ అవు తుందని అన్నారు.. బింబిసార చూసిన తర్వాత ఆయన చెప్పిన మాటనే నిజమైందన్నారు. అలాగే ఈసినిమా కూడ ఆయన చెప్పినట్టుగానే బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందనే నమ్మకం ఉందన్నారు.




# కాన్సెప్ట్ చాలా బాగుంది: సాయిధరమ్‌తేజ్

మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో జీఎ2 పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న చిత్రం వినరో భాగ్యము విష్ణు కథ.. ప్రముఖ నిర్మాత బన్నీవాసు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈసినిమా నుంచి రిలీజైన సాంగ్స్, టీజర్ మంచి అంచనాలను క్రియేట్ చేసింది.. ఈ తరుణంలో ట్రైలర్ లాంచ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ,



ఈసినిమా నెంబర్ సైబర్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతుండటంతో ఒక సైబర్ నెంబర్‌కు కాల్ చేసి మాట్లాడారని, కిరణ్ అబ్బవరం ను స్టేజ్‌మీదకు ఆహ్వానించి తనకు ఇష్టమైన పర్సన్ అని చెప్పుకొచ్చారు.. కాన్సెప్ట్ సినిమాలు ఆడుతున్నాయని, అనే ఒక లైన్ ఉంటే ఈసినిమా కచ్చితంగా ఆడుతుందని అన్నారు. ఈచిత్రంలో మంచి కాన్సెప్ట్ ఉందన్నారు. ప్రముఖ నటుడు సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ, ఈసినిమా కాన్సెప్ట్ చాలా బాగుందన్నారు. బన్నీవాసు, అరవింద్‌గారు మంచి సపోర్ట్‌చేశారన్నారు. ఈసినిమా టీం అందరికీ చాలా థాంక్స్ అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ చైతన్ భరద్వాజ్‌కు నేను పెద్ద ఫ్యాన్ అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు మురళికిశోర్, నిర్మాత బన్నీ వాసు, దర్శకుడు హరీశ్ శంకర్, దర్శకుడు మారుతి, హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడారు.

## అందరికీ ప్రతిసీన్ నచ్చుతుంది

అవికా గోర్ .. 'చిన్నారి పెళ్లికూతురు'తో అందరికీ సుపరిచితం.. ఉయ్యాల జంపాలా హీరోయిన్‌గా తెలుగుతోపాటు పలు చిత్రాలు పెర్ఫామెన్స్‌కు అవకాశం ఉన్న పాత్రలనుచేసిన అమ్మాయిగా తెలిసింది.. ఇపుడు పాప్‌కార్న్ సినిమాలో హీరోయిన్‌గా నటించటమే కాకుండా ఈచిత్రానికి ప్రొడ్యూసర్‌గా పరిచయం అవుతున్నారు.. అవికా గోర్, సాయి రోనక్ జంటగా నటిస్తున్న చిత్రం పాప్‌కార్న్.. ఎంఎస్ చలపతి రాజు సమర్పిస్తున్నారు. ఆచార్య క్రియేషన్స్,అవికా స్క్రీన్ క్రియేషన్స్ బ్యానర్లపై మురళి గంధం దర్శకత్వం వహిస్తన్నారు. భోగేంద్ర గుప్తా ఈచిత్రాన్ని నిర్మించారు. ఈనెల 10న ఈచిత్రం విడుదల కానుంది..అవికాగోర్ మీడియాతో మాట్లాడారు.



**పాప్‌కార్న్ మూవీ ఎలా మొదలైంది?**

మా దర్శకుడు మురళి ఈ స్క్రిప్టుతో వచ్చారు. కాన్సెప్ట్ గురించి చెప్పారు.. చాలా ఆసక్తికరంగా అన్పించింది.

90శాతం లిఫ్ట్‌లో జరిగే కథ.. ఓ నటిగా నాకు చాలా ఛాలెంజింగ్‌గా అన్పించింది.. ఆద్యంతం హీరోను, నన్ను చూస్తూ కూర్చోవాలి.. ఇది చాలా టఫ్ ..ఎందుకంటే ఇపుడు ఆడియెన్స్‌కు మంచి కంటెంట్ కావాలి.. లేకంటే మాస్ మసాలా కావాలి. వాటి రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ఈ కథను చెప్పారు. నటిగా నాకు ఎగ్జయిటింగ్‌గా అన్పించిన విషయం కూడ అదే.. నేనెపుడూ ఛాలెంజెస్‌ను తీసుకోవటానికి సిద్ధంగానే ఉంటాను. నేను గతంలో చేసిన సినిమాల్లోనూ స్క్రిప్టుకు ప్రాధాన్యంఉంటుంది.. నా నటనకు స్కోప్‌ఉంటుంది. అలాగే ఈ చిత్రంలోనూ నాకు, హీరోకి ఎక్కువ డైలాగులు ఉంటాయి.. సీన్‌ను బట్టి చేయటానికి చాలా సపోర్టింగ్ ఆర్టిస్టులు ఉండరు.. కామెడీ అయినా, ఏడుపు అయినా మేమిద్దరమే చేయాలి.. అంతగా అందరినీ మెప్పించాల్సిన అంశాలు ఉండటంతో ఈసినిమా చేయటానికి నేను రెడీ అనిచెప్పాను.

**కథ నచ్చి ప్రొడ్యూస్ చేశారా?**

కథ వినగానే, నా పరంగా ఎక్కువ టైమ్, అటెన్షన్ ఇవ్వాల్సిందేనన్న విషయం అర్ధమైంది.. నటిగా సెట్‌కి వెళ్లిచెప్పింది చేసి వచ్చేస్తాం..కానీ నిర్మాతగా అయతే అన్నీ విషయాలను పట్టించుకుంటాం.. సినిమా ఎలా రావాలి? ఎలా ప్రమోట్ చేయాలి? స్క్రిప్టు ఇంకా ఎక్కువ మందికి రీచ్ కావాలంటే ఇంకేచేయొచ్చు.. ఇలాంటివన్నీ ఆలోచిస్తాం. నేను నిర్మాతని కావాలని ఎప్పటి నుంచో అనుకున్నా.. ఈసినిమా కథవిగానే, ఇదే పర్ఫెక్ట్ టైం అన్పించింది.. అందుకే ఫస్ట్‌స్టెప్ వేశాను.

**సినిమా చూశాక ఇండస్ట్రీవారు ఏమన్నారు?**

నాగార్జున, చైతన్య,నిఖిల్, వీళ్లందరూ చాలా ఆనందంగా ఫీలయ్యారు. పోస్టర్ చూసినపుడు నేన వాళ్లతో ఈ విషయం చెప్పినపుడు చాలా హ్యాపీగా ఫీలయ్యాను.. ఎందుకంటే ఈ వయసులో నేను ఫక్తు కమర్షియల్ సినిమాలు చేస్తూ హ్యాపీగా డబ్బులు పోగేసుకోవచ్చు. కానీ నేను ప్యాషన్‌తో చేస్తున్నాననే విషయం వాళ్లకు అర్ధమైంది.. జనాలు నన్ను కేవలం మాస్ సినిమాల్లో నటిగా చూడదలుచుకోవటం లేదు. అంతకు మించి కోరుకుంటున్నారు. అందుకే నేను కూడ ఇష్టపడి చేయగలుగుతున్నా. ఎక్కడికి పోతావు చిన్నవాడా లో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు.

**తెలుగులోకి వచ్చి పదేళ్లవుతుంది.. మీరు హ్యాపీయేనా?**

చాలా హ్యాపీ. చాలా మంచి పాత్రలు చేశా.. థాంక్యూలో నేను చైకి రాఖీ కట్టాను.. చాలా మంచి క్యారెక్టర్ ఇది.. హ్యాష్‌ట్యాగ్ బ్రో వల్ల మనిషిగా నాలో చాలా మార్పులొచ్చాయి.. ఏ పాత్ర చేసినా దాని వల్ల మనలో మార్పు చూసుకుంటాం.. నేను అలా మంచి విషయాలను అర్ధం చేసుకుని నన్ను నేను మలచుకుంటాను.

**ఫ్యూచర్ ప్రాజెక్టులు ఏంటి?**

తెలుగు సినిమాలు కొన్ని చేస్తున్నా... త్వరలోనే అనౌన్స్‌మెంట్లు వస్తాయి.. హిందీలో మహేష్‌భట్, విక్రమ్ భట్ సినిమా ఖ1920'లో చేస్తున్నా.. మేలో ఆసినిమా విడుదల కానుంది.

# 'రుద్రుడు' ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్

రాఘవ లారెన్స్ హీరోగా కతిరేసన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం రుద్రుడు.. ఫైవ్‌స్టార్ క్రియేషన్స్, ఎల్‌ఎల్‌పి ఈచిత్రాన్ని నిర్మిస్తోంది.. కతిరేశన్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో రాఘవ లారెన్స్ సరికొత్తఆ ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజి కల్ ప్రమోషన్స్‌ను స్టార్ చేశారు.. ఫస్ట్‌సింగిల్‌కు సంబంధించి అప్‌డేట్ ఇచ్చారు.. పాడాద పాటెలం .. ఫిబ్రవరి 11న విడుదల చేస్తున్నామని తెలిపారు.. జివి ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు. శరత్‌కుమార్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఏప్రిల్ 14న గ్రాండ్‌గా విడుదల కానుంది.



# ఫిలింఛాంబర్, నిర్మాతల మండలి ఎన్నికల్లో స్వార్ధపరులకు ఓటు వేయకండి: నట్టి కుమార్

దర్శకరత్న దివంగత దాసరి నారాయణరావు మెడిక్లెయిమ్ పాలసీని నిర్మాతల మండలి 1100 మంది సభ్యులకు వర్తింపజేశారని, నిరంతరం పర్శిమ బాగుకోసం పాటుపడిన దాసరి లాంటి పెద్దలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాల్సిన కొందరు నేటి సినీ పెద్దలు అలాంటి వాటికి తిలోదకాలు ఇచ్చే స్థితికి చేరుకోవటం దారుణమని ప్రముఖ నిర్మాత నట్టికుమార్ విమర్శించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 7 లక్షల మెడిక్లెయిమ్ పాలసీని కౌన్సిల్‌లోని ప్రతి సభ్యుడికి అందజేయాలని డిమాండ్ చేశారు. నిధులు తక్కువగా ఉంటే కనీసం 5లక్షలు పాలసీ అయినా అందరికీ వర్తింపజేయాలని సూచించారు.



**పార్లమెంట్ ఆవరణలో 'దాసరి' విగ్రహం ఏర్పాటు చేయాలి**

చిత్ర పరిశ్రమ నిలబడటానికి దాసరి లాంటి పెద్దలు కారణమని అన్నారు. కాపు, బలిజ, తెలగ, తదితర కులాల పక్షాన అలాగే రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేయటంతోపాటు సినీరంగానికి దర్శకరత్న దాసరి నారాయణరావు చేసిన విశేష సేవలకు గుర్తించి ఆయన విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో పెట్టాలని అన్నారు. అలాగేహైదరాబాద్ ఫిలింనగర్‌లోనూ, పుట్టిన ఊరు పాలకొల్లులో దాసరి పేరుతో ప్రత్యేకంగా పార్కులను నిర్మించేలా వివిధ రాజకీయ పక్షాలకు, పార్టీల నేతలకు ఆయన విజ్ఞప్తిచేశారు. తామే సినీ పెద్దలమని చెప్పుకునే కొందరు సినీ పెద్దలు పూర్తిగాస్వార్ధ రాజకీయాలు చేస్తూ, చిన్న సినిమాలను చంపేస్తూ, చిన్న నిర్మాతల వినాశనానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. త్వరలో జరగబోయే తెలుగు ఫిలిం ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఎన్నికలు ఇంకా నిర్మాతల గిల్డ్, రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు సినిమా పరిశ్రమతోఉన్న సంబంధాలకు సంబంధించిన అంశాలపై ఆయన ప్రస్తావించారు. 21 మంది నిర్మాతలు కేవలం వారి స్వార్ధంకోసం గిల్డ్ అని వేరే కుంపటి పెట్టుకుని కూడ తెలుగు ఫిలిం ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలిపై కూడ పెత్తనం చెలాయించటం ఎంతవరకు కరెక్ట్ అనిఅన్నారు. దిల్‌రాజు, దామోదర ప్రసాద్, స్రవంతి రవికిశోర్ వంటివారు అక్కడా తమదే రాజ్యం..ఇక్కడా తమదే రాజ్యం అన్నరీతిలో వ్యవహరిస్తున్నారని అన్నారు.

# 'భీమదేవరపల్లి బ్రాంచి' టీజర్

ఎబి సినిమాస్, నిహాల్ ప్రొడక్షన్స్ పతాకంపై అంజి వల్గుమాస్, రాజవ్వ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కీర్తి లత గౌడ్, అభిరామ్ రూప శ్రీనివాస్, సాయి ప్రసన్న నటీనటులుగా రమేష్ చెప్పాల దర్శకత్వంలో డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం భీమదేవరపల్లి బ్రాంచి... ఇంతకు ముందు ఎంతోమంది దర్శకుడు, నిర్మాతలు స్వయంగా రామ్ గోపాల్‌వర్మ తన సినిమాలో నటించమని అడిగినా నో చెప్పిన ప్రఖ్యాత రాజకీయ విశ్లేషకులు



ప్రొఫెసర్ నాగేశ్వర్ , సిబిఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, అద్దంకి దయాకర్ ఈచిత్రంలో నటించటం విశేషం.. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షనన కార్యక్రమాలు జరుపుకుంటోంది.. ఈచిత్రానికి సంబంధించిన టీజర్‌ను తాజాగా తెలంగాణ మంత్రి కెటిఆర్ చేతులమీదుగా ఆవిష్కరిపంజేశారు. అనంతరం మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ, మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈచిత్రం టీజర్‌ను చూసి చాలా ఇంప్రెస్ అయ్యానని అనాన్రు. అలాగే మంచి మెసేజ్ ఉన్న సినిమా అని అర్ధం అవుతోందన్నారు. పూరిసినిమాను తప్పకుండా చూస్తానని అన్నారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత డాక్టర్ బత్తిని కీర్తి లత గౌడ్ తదితరులు మాట్లాడారు.

# శివరాత్రి కానుకగా... 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'.

యశ్వంత్, రాకింగ్ రాజేష్, అనన్య, హిందోలా చక్రవర్తి , పూజ, సిమ్రాన్ కీలకపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'.. ఈ చిత్రా నికి సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావు దర్శకత్వం వహిస్తున్నారు.. తుమ్మల ప్రసన్నకుమార్ నిర్మాత. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18న విడుదల కానుంది.. తాజా గా ఫిల్మ్‌ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడారు.. ఇప్పటి వరకు రాని కామెడీ , హారర్ థ్రిల్లర్ మూవీ అన్నారు. మంచి సినిమా అవుతుందనే నమ్మ కం ఉందన్నారు. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, దర్శకుడు రేలంగి నరసింహారావు చేస్తున్న 76వ చిత్రమన్నారు. చక్కని కథతో తెరకెక్కించారని అన్నారు.. మా టీం అంతా డబ్బు కోసం కాకుండా ఇది మన సినిమా అని అప్యాయంగా పనిచేశారని అన్నారు. కాశ్మీర్, హైదరాబాద్ ప్రాంతాల్లో మంచి లొకేషన్లలో చిత్రీకరించినట్టు తెలిపారు. అవుట్‌పుట్ బాగా వచ్చిందన్నారు. ఇందులో కామెడీ, హారర్ సన్నివేశాలు ఆకట్టుకున్నాయన్నారు. యశ్వంత్, రాకింగ్ రాజేష్, అనన్య హిందోళా చక్రవర్తి, రఘు కుంచె, సురేష్ కొండేటి, తుమ్మలపల్లి రామారావు, రామసత్యనారాయణ కాదంబరి కిరణ్ పాల్గొన్నారు.

